'అన్నపూర్ణ'కు కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 17: ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు నీటి ఎత్తిపోలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.09 టీఎంసీలకు చేరుకున్నాయి. మధ్యమానేరు ద్వారా వచ్చిన 6,400 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

మట్టి వినాయకులను పూజించుకుందాం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆది శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్ తదితరులు

సిరిసిల్ల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సమతుల్యానికి, పర్యావరణ పరిరక్షణకు వచ్చేసారి ఎక్కువగా మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకుని పూజించుకుందామని ఇందుకు హిందూ ఉత్సవ సమితి ప్రోత్సహించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిరిసిల్లలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ పండుగలు సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పడుతాయని తొలి పూజను అందుకునే వినాయక నవరాత్రి వేడుకలను జిల్లా వ్యాప్తంగా భక్తి శ్రద్ధలతో జరుపుకుంటున్నారని అన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరుపు కోవడానికి 600 మంది వరకు పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, హిందూ ఉత్సవ సమితి ఛైర్మన్ చేపూరి శ్రీనివాస్, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- ఘనంగా ప్రజాపాలన దినోత్సవం



జెండాకు వందనం చేస్తున్న విప్ ఆది శ్రీనివాస్



లబ్ధిదారులకు పత్రాలను అందిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ప్రజల అకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం సెప్టెంబరు 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. 1948 సెప్టెంబరు 17న భారతదేశంలో తెలంగాణ అంతర్భాగమైన రోజు స్వాతంత్ర్య భారతావనిలో అరవై ఏళ్లుగా స్వీయ అస్తిత్వం కోసం ఉద్యమించి స్వరాష్ట్రంగా అవతరించిన తెలంగాణ అభివృద్ధి పథంలో ముందంజలో ఉందని చెప్పడానికి చాలా సంతోషంగా ఉందని అది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని అవిష్కరించారు. అంతకు ముందు సిరిసిల్లలోని చేనేత చౌక్‌లో ఉన్నా తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద అది శ్రీనివాస్ పాటు జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా ఎస్పీ అఖిల్ మహా జన్‌లు నివాళులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల మేరకు అభయహస్తం హామీలను ఒక్కొక్కటిగా అధికారంలోకి వచ్చిన 48 గంటల నుంచే అమలు చేయడం ప్రారంభించిందని అన్నారు. ఆరు గ్యారంటీల్లో రెండు గ్యారంటీలను 48 గంటల్లోనే ప్రభుత్వం అమలు ప్రారంభించి చరిత్ర సృష్టించిందని అన్నారు. అడబిడ్డలకు తొలి ప్రాధాన్యత ఇస్తూ మహాలక్ష్మీ పథకంలో అర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని అన్నారు. మహాలక్ష్మీ పథకంలో రూ 500లకే వంట గ్యాస్ ఇవ్వాలన్న అలోచనతో ఈ యేడాది ఫిబ్రవరి 27న ప్రారంభించడం జరిగిందని అన్నారు. ఆరోగ్య శ్రీ చికిత్సను రూ.5 లక్షల నుంచి రూ 10 లక్షలకు పెంచామన్నారు. గృహజ్యోతి పథకంతో పేదలకు విద్యుత్ బిల్లుల భారం తగ్గిందన్నారు. తెలంగాణలో విద్యా వ్యవస్థను మెరుగుపర్చడానికి తెలంగాణ విద్యా కమిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లే రూ. 2 లక్షల మేరకు రైతులకు రుణమాఫీ చేశామని, ప్రతి నియోజకవర్గానికి 3,500ల ఇందిరమ్మ ఇళ్ల ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఎస్పీ అఖిల్‌మహాజన్, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల అర్డీవో రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ నాగుల సత్యనారాయణ, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

జిల్లా పరిశ్రమల శాఖ టీ ప్రైడ్ కింద లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. 17 మంది ఎస్టీలు, 36 మంది ఎస్సీలు, ఇద్దరు దివ్యాంగులకు మంజూరు పత్రాలను ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ అందించారు. వీటితో పాటు మహ్మద్ షైమిన్, నజీమ్ సుల్తానా, గుమ్మడి అభయ్‌లకు కారుణ్య నియమాక పత్రాలను అందించారు.

పోలీసు కార్యాలయంలో..

సిరిసిల్ల క్రైం: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జాతీయ జెండాను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆవిష్కరించారు. డీఎస్పీ కార్యాలయం, సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్, రూరల్ సర్కిల్ కార్యాలయంలోనూ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, టౌన్ సిఐ కె. కృష్ణ, రూరల్ సిఐ మొగిలి, ఆర్‌ఐలు యాదగిరి, రమేశ్, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోయి రావయ్యా.. బొజ్జ గణపయ్యా!




సిరిసిల్లలో వినాయకుడి శోభాయాత్ర

● మానేరు వాగు తీరంలో నిమజ్జనం

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

భక్తుల జయజయధ్వానాల మధ్య మంగళవారం వినాయక నిమజ్జనోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సిరిసిల్ల జిల్లా మానేరు వాగులో భారీ విగ్రహాలను నిమజ్జనం చేశారు. జిల్లావ్యాప్తంగా దాదాపు చిన్న పెద్ద విగ్రహాలు 3 వేలకు పైగా ఏర్పాటు చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో 600 భారీ విగ్రహాలు, చిన్న తరహా విగ్రహాల మండపాలకు కొదవ లేదు. సిరిసిల్ల మానేరు వాగు బ్రిడ్జి వద్ద భారీ క్రేన్‌లతో నిమజ్జనం చేశారు. ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా ఎస్పీఅఖిల్‌మహాజన్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డిలు పర్య వేక్షించారు. సిరిసిల్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ప్రశాంతంగా నిమజ్జనం జరిగే విధంగా సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.

మహిళలు కోలాటాలు, దాండియా నృత్యాలు చేశారు. ద్విచక్రవాహనాలు, కార్లలో వినాయకులను తీసుకవచ్చి నిమజ్జనం చేశారు. వేలం పాటల్లో లడ్డు దక్కించుకోవడానికి భక్తులు పోటీపడ్డారు.




సిరిసిల్లలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు



మానేరులో వినాయక నిమజ్జనం

చిట్యాల ఐలమ్మ, కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి ఉత్సవాలకు కమిటీ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 17: తొలి తెలంగాణ ఉద్యమకారులైన మహనీయులు చిట్యాల ఐలమ్మ, కొండా లక్ష్మన్ బాపూజీ జయంతి ఉత్సవాల కమిటీని అన్ని ప్రజా సంఘాలు, కుల సంఘాల ఆధ్వర్యంలో వేయడానికి సహకరించాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో రాములతో కలసి సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు మాట్లాడారు. చిట్యాల ఐలమ్మ, కొండ లక్ష్మన్ బాపూజీ త్యాగాల చరిత్రను రేపటి తరానికి అందించాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. ఈ నెల 19న సిరిసిల్ల పట్టణం లహరి ఫంక్షన్ హాల్‌లో సమావేశం ఏర్పాటు చేసి కమిటీని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పంతం రవి, ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ జిల్లా అధ్యక్షుడు కంసాల మల్లేశం, విద్యార్థి సంఘం నాయకుడు పోకల సాయికుమార్, నాయకులు చెప్యాల గంగారం, గొట్టె రవి పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు ఎల్లవేళలా అండగా ఉంటాం

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆది శ్రీనివాస్‌ను కలిసిన గల్ఫ్ కార్మిక సంఘాల నాయకులు

వేములవాడ, సెప్టెంబర్ 17 : జీవనోపాధి కోసం రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాలకు వలస వెళ్లి వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరు లతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి రోజు నుంచి గల్ఫ్ కార్మికుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం వివిధ దశలలో చర్చలు జరిపామన్నారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటు, ఎన్నారై పాలసీ అమలుపై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ నెల 14వ తేదీన హైదరాబాదులో పలువురు శాసనసభ్యులు, గల్ఫ్ కార్మిక సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నివేదించగా, ముఖ్య మంత్రి వెంటనే స్పందించి గల్ఫ్ సంక్షేమం కోసం నాలుగు అంశాలను అమలు చేస్తూ వెను వెంటనే జీవో విడుదల చేశారన్నారు. 2023 డిసెంబర్ 7వ తేదీ నుంచి ఏ కారణం చేతనైనా గల్ఫ్ దేశాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు 5 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలి పారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను విని పరిష్కరించేందుకు హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని, గురుకుల పాఠశాలు, కళాశాలలో గల్ఫ్ కార్మికుల పిల్లలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. గల్ఫ్‌లో మృతి చెందిన వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ఇద్దరు కార్మికులకు 5 లక్షల రూపాయల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించామన్నారు. టీఆర్ఎస్ నాయకులు గల్ఫ్ కార్మికులను మోసం చేశారన్నారు. గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు మంగళవారం వేములవాడ పట్టణంలోని క్యాంపు కార్యాల యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలసి ధన్యవాదాలు తెలిపారు.

న్యూస్ బాక్స్

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 10,465 క్యూ సెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 10,465 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

27లోగా బీఎడ్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 17: ఎస్‌యూ పరిధిలోని బీఎడ్ రెండో సెమిస్టర్ విద్యార్థులు, ఎంఎడ్ రెండో, నాలుగో సెమిస్టర్ విద్యార్థులు ఈనెల 27లోగా పరీక్ష రుసుం చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీ రంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 500 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబర్ ఒకటో తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. పరీక్షలను అక్టోబరులో నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు.

చెట్లు నరికిన వ్యక్తికి జరిమానా

● ఫీల్డ్ అసిస్టెంట్‌కు మెమో

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనంలో చెట్ల నరికివేతపై ఎంపీడీవో సత్తయ్య మంగళవారం విచారణ చేపట్టారు. చెట్లను నరికివేసిన వ్యక్తిని గుర్తించి వేయి రూపాయల జరిమానా విధించారు. విధులపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఫీల్డ్ అసిస్టెంట్ నరేశ్‌కు మెమో జారీ చేశారు. నాటిన మొక్కలను కాపాడుకునేందుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. చెట్లను నరికి వేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో సత్తయ్య హెచ్చరించారు. ఎంపీవో రాజు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

కలప చెట్లు నరికివేత

● పట్టుకున్న అటవీ శాఖ అధికారులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు17 : మండలంలోని వేములకుర్తి గ్రామ శివారులో అక్రమంగా టేకు చెట్లు నరుకుతున్న వేములకుర్తి గ్రామానికి చెందిన వ్యక్తిని మంగళవారం ఇబ్రహీంపట్నం ఎఫ్‌ఎస్‌వో చైతన్యశ్రీ పట్టుకున్నారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి గ్రామ శివారులోని రామాలయం సమీపంలో నాలుగు టేకుచెట్లను కొట్టివేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి కలప దుంగలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆమె పేర్కొన్నారు.అక్రమంగా కలప తరలించిన, నరికేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఫలించిన ఆశలు

● గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం
● సమస్యలపై అధ్యయనానికి సలహా కమిటీ
● ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి



సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 17 : గల్ఫ్ కార్మికుల ఆశలు ఫలించాయి. చాలా కాలంగా ఎదిరిచూస్తున్న ప్రవాస కార్మికుల సమస్యలకు దారిదొరికింది. గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల మానిఫెస్టోలో ప్రకటించి నిరూపించింది. గల్ఫ్ కార్మికుల మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం అందించాలని, గల్ఫ్ కార్మికుల సమస్యలపై అధ్యయనానికి సలహా కమిటీ ఏర్పాటు చేయాలని, ప్రజాభవన్‌లో ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమం ఏర్పాటునకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. వీటితో పాటు గల్ఫ్ కార్మికుల విద్యార్థులకు గురుకుల విద్యాలయాల్లో సీట్ల కేటాయింపునకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన డిసెంబరు 7, 2023నుంచి గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ. 5లక్షల పరిహారం అందించనుంది. ఈ విధంగా గల్ఫ్ కార్మికుల సంక్షేమంపై ప్రభుత్వం చొరవచూపడంతో గల్ఫ్‌దేశాల్లో ప్రవాస కార్మికులు సంబరాలు జరుపుకుంటున్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి పెటారు. రాష్ట్రంలోని ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి గల్ఫ్ దేశాలకు వేలాది మంది కార్మికులు వెళ్లి జీవనోపాధి పొందుతున్నారు. ప్రధానంగా దుబాయ్, సౌదీ, కువైట్, బహ్రెయిన్, మస్కట్, ఖతర్, ఇరాక్ దేశాలకు వెళ్లిన ప్రవాస కార్మికులు అనేక కష్టాలు పడుతున్నారు. ప్రభుత్వం ఓ పాలసీని అమలులోకి తీసుకురావడంతో గత కొన్నేళ్లుగా గల్ఫ్ కార్మికులు పడుతున్న కష్టాలకు కొంత వెసులుబాటు లభించనుంది. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలు గల్ఫ్ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడి దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలోనే గల్ఫ్ కార్మికుల ప్రతినిధులతో సీఎం పలు మార్లు సమావేశమై చివరకు కార్యరూపం దాల్చారు. దీంతో గల్ఫ్‌లోని దుబాయ్, సౌదీ అరేబియా, కువైట్, మస్కట్, బెహరాన్, ఇరాక్ తదితర దేశాల్లో ఉన్న వేలాది మంది గల్ఫ్ కార్మికుల్లో ఆశలు చిగురించాయి.

గల్ఫ్ కార్మికులకు తీరనున్న కష్టాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ప్రాంతాలకు చెందిన వేలాదిమంది యువత ఉపాధికోసం గల్ఫ్‌బాట పట్టారు. ఇందులో 75శాతం కార్మికులకు కష్టాలే నెలకొన్నాయి. మిగితా 25శాతం కార్మికులు గల్ఫ్ వెళ్లి మంచి ఫలితాలే సాధిస్తున్నారు. గల్ఫ్ కార్మికుల విద్యార్థులకు గురుకుల విద్యాలయాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించడంతో ప్రయోజనం చేకూరనుంది. గల్ఫ్ వెళ్లిన కార్మికుల్లో పనులు లేక వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. వీరి సంక్షేమంకోసం ప్రభుత్వం తీసుకుంటు న్న నిర్ణయాలు ఎంతో ఉపయోగపడనుంది. గల్ఫ్‌దేశాల్లో ఉన్న కార్మికుల కష్టాలు, కన్నీళ్లు, బాధలు తీరే అవకాశం ఉంటుంది.

ఏజెంట్ల మోసాలకు అడ్డుకట్ట

గల్ఫ్ కార్మికుల సమస్యల అధ్యయనానికి సలహా కమిటీ వేయాలని నిర్ణయించడంతో ఏజెంట్ల మోసాలను అరికట్టనున్నారు. ఏజెంట్ల చేతిలో అనేకమంది కార్మికులు మోసపోయి గల్ఫ్ దేశాల్లో జైలు పాలయ్యారు. విజిట్ వీసాపై వెళ్లి చిక్కుల్లో పడ్డారు. వందలాదిమంది అప్పులపాలై పలువురు ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో ఏజెంట్ల మోసాలపై ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేసే అవకాశం ఉంది. గల్ఫ్ దేశాల్లోని ఇండియన్ ఎంబసీల్లో హిందీ, ఇంగ్లీషు, తెలుగు మాట్లాడే అధికారులను నియమిస్తే కార్మికులకు ప్రయోజనం కలుగుతుందనే చర్చ ఉంది.

ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం

హైడ్రాతో రాష్ట్ర వనరులను కాపాడుతాం
మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

కరీంనగర్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో ఆరు గ్యారెంటీలను చిత్తశుద్ధితో అమలు చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం కరీంనగర్ ఆర్‌అండ్ బీ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ చేయవద్దా, మహిళలకు ఉచిత ప్రయాణం వద్దా అంటూ ప్రతిపక్ష నాయకులను ప్రశ్నించారు. వీటి కోసమే రాష్ట్రం అప్పులు చేసేది అని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వనరుల గురించి ప్రధాని మోదీకి తెలుసునని పేర్కొంటూ గత ప్రభుత్వం అప్పులు చేసి దుబారా చేశారని అన్నారు. ఈ ఐదేళ్లలో ఇచ్చిన ప్రతిహామీ అమలు చేస్తామన్నారు. హైడ్రా అనేది చెరువులు, వనరులు కాపాడడానికేనని, అక్రమంగా ఎవరు ఏ పనిచేసినా ఊరుకునేది లేదన్నారు. కొన్ని రాష్ట్రాలు తెలంగాణతో సహా అప్పుల్లో ఉన్నాయని ప్రధాని మోదీ చేసిన కామెంట్‌పై ఆయన స్పందిస్తూ బీజేపీ నేతగా మాట్లాడి ఉండవచ్చన్నారు. అనర్హత వేటుపై విలేకరులు అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ దీనిపై శాసనసభాపతి నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మాజీ ఎమ్మెల్యేలు పంపిణీ చేస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. ప్రజాపాలనలో ప్రజల అవసరాలను తీర్చే ప్రభుత్వం మాదన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్లలో మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలను పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

కారుణ్య నియామకాలు పూర్తి చేయాలి



మంత్రి శ్రీధర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందచేస్తున్న టీఎన్‌జీవో జిల్లా నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 17: జిల్లా పరిషత్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు పూర్తి చేయాలని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుకు కారుణ్య నియామకాల అభ్యర్థులతో కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు గత 8 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి వెంటనే సీఎంవో కార్యదర్శితో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీజీవో నాయకుడు మడిపెల్లి కాళిచరణ్, సర్దార్ హర్మిందర్‌సింగ్, రాజేశ్‌భరద్వాజ్, సుమంత్‌రావు, అఫ్జల్, నాల్గవతరగతి సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, నోముల రాహూల్‌రెడ్డి, భాగ్య, ఆదిత్యవర్ధన్, షెహ్బాజ్, రఘురామ, నచికేతరెడ్డి, అజిత్, పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

నిజాం పాలనకు చరమగీతం పాడింది కమ్యూనిస్టులే

● సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి



అనభేరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

భగత్‌నగర్, సెప్టెంబరు 17 : హైదరాబాద్ సంస్థానంలో నిజాం పాలనకు చర మగీతం పాడింది కమ్యూనిస్టు పార్టీయే అని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. మంగళవారం తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని సీపీఐ కార్యాలయం ఎదుట జెండాను ఆవిష్కరించారు. అనంతరం సాయుధ పోరాట వీరుడు, సీపీఐ మొదటి కార్యదర్శి అనభేరి ప్రభాకర్‌రావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రను వక్రీకరించాలని చూస్తే సీపీఐ పార్టీ చూస్తూ ఊరుకోదన్నారు. నిజాం పాలన నుండి విముక్తి కోసం బద్దం ఎల్లారెడ్డి, రావి నారాయణరెడ్డి, మక్దూమ్ మొహియుద్దీన్‌లు తెలంగాణ సాయుధ పోరాటానికి సెప్టెంబర్ 11న పిలుపునిచ్చారన్నారు. ఆ పిలుపునందుకుని వేలాది మంది తరలి వచ్చి వీరోచిత పోరాట ఫలితంగానే హైదరాబాద్ సంస్థానాన్ని నిజాం భారత దేశంలో విలీనం చేశాడన్నారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టు పార్టీ శ్రేణులు సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పొనగంటి కేదారి, కొయ్యడ సృజన్, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, జాగీరు సత్యనారాయణ, బుచ్చన్నయాదవ్, బోయిని తిరుపతి, పైడిపల్లి రాజు, కిన్నెర మల్లవ్వ, తాళ్లపల్లి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

చిగురుమామిడి, సెప్టెంబరు 17 : మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన పోలవేణి శ్రీనివాస్ (48) అనే వ్యక్తి మంగళవారం పాము కాటుతో మృతి చేందినట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. శ్రీనివాస్ ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. కరెంటు మోటరు పెట్టేందుకు వెళుతుండగా పాము కాటు వేసింది. కుటుంబసభ్యులు శ్రీనివాస్‌ను చికిత్స నిమ్మితం కరీంనగర్‌కు తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. శ్రీనివాస్ భార్య పోలవేణి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎల్‌ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, సెప్టెంబరు 17 : శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో ఆగస్టు 2024లో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ నాలుగో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను మంగళవారం ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్‌వీ శ్రీరం గప్రసాద్ విడుదల చేశారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్ www.satavahana.ac.inlZ చూసుకోవచ్చని తెలిపారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



కొండగట్టులో క్యూలైన్‌లో వస్తున్న భక్తులు

మల్యాల, సెప్టెంబరు 17 : కొండగట్టు అంజనేయస్వామి సన్నిదానం మంగళవారం భక్తులతో సందడిగా మారింది. వేలాదిగా భక్తులు కొండపైకి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు జరిపారు. అనంతరం బేతాళడు, శ్రీరాములవారికీ పూజలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు హరిహరనాథ్ పర్యవేక్షించారు.

● 30న తలనీలాల టెండర్లు

కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో పోగు చేసే తలనీలాలకు ఈనెల 30న టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఈవో రామకృష్ణరావు తెలిపారు. మూడుసార్లు టెండర్లు నిర్వహించినప్పటికీ కాంట్రాక్టర్ల కుమ్మక్కుతో వేలం పెరగ కుండా వాయిదా పడుతూ వస్తున్న టెండర్‌ను మరోసారి కూడా 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

గణపతి నిమజ్జన ఊరేగింపులో గొడవ..

● ఇందిరానగర్‌లో ముగ్గురికి కత్తిపోట్లు
● ఐదుగురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

కోల్‌సిటీ, సెప్టంబరు 17: గోదావరిఖని ఇందిరానగర్ వద్ద సోమవారం రాత్రి గణపతి నిమజ్జన ఊరేగింపులో వివాదం చోటు చేసుకుంది. ఊరేగింపులో ఇందిరానగర్‌కు చెందిన బాగ్ విష్ణు, అజర్, గోపాల్ అర్కిట్, వీర్ల సృజన్ తదితరులు రామాంజనేయ బార్ వద్ద నృత్యాలు చేస్తుండగా గాంధీనగర్‌కు చెందిన కాకినట్ల మణికంఠ అలియాస్ మణి, గడ్డం అరుణ్ కుమార్ అలిసాయ్ సోనులు అటువైపుగా వచ్చారని, ఇందిరానగర్‌కు చెందిన విష్ణు, మరో ఇద్దరు వ్యక్తులతో గొడవ పడ్డారన్నారు. అనంతరం మణికంఠ, అరుణ్ కేసీఆర్ కాలనీకి చెందిన తాళ్లపల్లి మహేంద్ర, బోడ కౌశిక్ అలియాస్ సిద్ధు, బోడ కార్తికేయలతో కలిసి వచ్చి కత్తులతో గణపతి ఊరేగింపులో ఉన్న ఇందిరానగర్ యువకులపై హత్యాయత్నం చేసినట్టు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఈ ఘటనలో విష్ణు, గోపాల్, సృజన్‌లకు గాయాలయ్యాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, మణికంఠ, మహేంద్ర, అరుణ్ కుమార్‌లను మంగళవారం అరెస్టు చేసినట్టు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. కార్తికేయ, కౌశిక్‌లు పరారీలో ఉన్నట్టు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్‌ఐ రమేష్, కానిస్టేబుళ్లు తీట్ల శ్రీనివాస్ తదితరులు సీఐని అభినందించారు.

సింగరేణి కార్మికుడి మృతిపై కుమారుడి ఫిర్యాదు

● తల్లి, సోదరిపైనే అనుమానం..
● విచారణ జరుపుతున్న పోలీసులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 17 : గోదావరిఖని ఐబీ కాలనీలో సోమవారం సింగరేణి కార్మికుడు బానోత్ హరిసింగ్ మృతిపై అనుమానాలున్నాయని, తన తల్లి దస్లి, సోదరి సునీత కారణం కావచ్చని, హరిసింగ్ కుమారుడు వెంకటేష్ పోలీసులకు మంగళవారం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశారు. హరిసింగ్ మృతదేహంపై గాయాలు ఉండడం, మెడ చుట్టూ బలమైన గాయం ఉండడంతో పోలీసులు పలు కోణాల్లో విచారణ జరుపుతున్నారు.

రూ. 1.68 లక్షల నగదు చోరీ

కథలాపూర్, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ నుంచి డ్రా చేసి బైక్‌లో పెట్టిన రూ 1.68 లక్షలను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం ఎత్తుకెళ్లారు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం... తుర్తికి చెందిన పుర్రె గంగనర్సయ్య అనే రైతుకు రుణమాఫీ కాగా ఆ డబ్బులను డ్రా చేసుకున్నాడు. ఆ డబ్బులు బైక్‌లో పెట్టి కొంత దూరంలో ఉన్న బేకరీకి వెళ్లారు. కొంతసేపటికి వచ్చి చూసే సరికి డబ్బులు మాయమయ్యాయి. దీంతో రైతు లబోదిబోమని స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. చుట్టుపక్కన ఉన్న సీసీ పుటేజీలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

మోటార్ వైర్ల చోరీ

భీమారం, సెప్టెంబరు 17: భీమారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ పంపుసెట్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్తున్నారు. దమ్మన్నపేట, మన్నెగూడెం, కట్లకుంట, భీమారం గ్రామాల రైతులు మోటార్లు బిగించుకుని వ్యవసాయానికి నీరు వాడుతున్నారు. రాత్రి వేళ సమయాల్లో వ్యవసాయ పంపుసెట్ల మోటార్ వైర్లతో పాటు కాపర్ వైరును దొంగలు ఎత్తుకెళ్తున్నారు. రైతులు ఉదయాన్నే పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లి చూడగా ఫ్యూజులు తీసివేసి వైరు కత్తిరించుకు పోవడంతో రైతులు ఒక్కసారిగా షాక్‌కు గురవుతున్నారు. వరి పంటసాగు సమయంలో ఇలా జరుగడం పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ కాపర్ వైరును దొంగలు ఎత్తుకెళ్లడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంలను పట్టుకుని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

చందుర్తి, సెప్టెంబర్ 17: చందుర్తి మండలం ఎన్గల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. వేములవాడ రూరల్ మండలం హన్మాజీ పేటకు చెందిన గడ్డం కిషన్‌రెడ్డి ఎనగల్ గ్రామం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, చందుర్తి మండలం బండపల్లి గ్రామానికి చెందిన నేదురి ఎల్లయ్య ద్విచక్ర వాహనంపై వేములవాడ వైపు వెళ్తూ ఎనగల్ శివారులో ఎదురెదురుగా ఢీకొన్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పిచ్చి కుక్క దాడిలో..

కోనరావుపేట, సెప్టెంబర్ 17 : కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో మంగళవారం పిచ్చి కుక్క దాడి చేయగా ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో పుల్కం జలంధర్, తిక్కల రూన్సీ ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడిచేసి గాయపరిచింది. వెంటనే గమనించిన గ్రామస్థులు చిన్నారులను కాపాడారు. వైద్యం నిమిత్తం కోనరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

కేశనపల్లిలో డీజే సీజ్

ముత్తారం సెప్టెంబర్ 17: మండలంలోని కేశనపల్లిలో సోమవారం రాత్రి అనుమతిలేకుండా డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేయడంతో పోలీసులు వాటిని సీజ్ చేశారు. సోమవారం నిమజ్జన ఊరేగింపు జరుగుతుండగా గ్రామానికి చెందిన ఓ పార్టీ మాజీ ప్రజాప్రతినిధి అనుమతి లేకుండా డీజే సౌండ్ బాక్స్‌లు ఏర్పాటు చేసి మహిళలను చూస్తూ అసభ్యకరంగా వ్యవహరించాడు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో డిజే సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

వేములవాడ టౌన్, సెప్టెంబరు 17: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్ పేర్కొన్నారు. కళాశాల ఆవరణలో మంగళవారం ఎన్ఎస్ఎస్ నోడల్ అధికారి మార్కొండ శకుంతల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులతో కలిసి స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, అధ్యాపకులు సురేందర్‌రెడ్డి, శోభారాణి, శ్రీధర్‌రావు, కృష్ణప్రసాద్, నర్సయ్య, కరుణ, మధుబాబు, అర్జున్, తిరుపతి తదితరులు ఉన్నారు.

● వీర్నపల్లి: స్వచ్ఛతతోనే ప్రజలందరి ఆరోగ్యానికి మేలు కలుగుతుందని మండల ప్రత్యేక అధికారి, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి నర్సింహులు అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో అధికారులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వచ్ఛత కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో విమోచన వేడుకలు

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు17 : తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను బీజేపీ నాయకులు మంగళవారం ఘనం నిర్వహించారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లోని సర్దార్ వల్లబాయ్‌పటేల్ విగ్రహం ఎదుట బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ అధ్వర్యంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. పట్టణంలోని గాంధీనగర్‌లో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కో- కన్వీనర్ ఆడేపు రవీందర్, చిన్నబోనాల గ్రామంలో వార్డు కార్యాలయంతోపాటు పార్టీ కార్యాలయాల వద్ద మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్‌లు జాతీయ జెండాలను అవిష్కరించారు. ఈ కార్యక్రమాలలో జిల్లా ఉపాధ్యక్షుడు శీలం రాజు, గాజుల సదానందం, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు అంకారపు రాజు, పట్టణ ఉపాధ్యక్షులు అదిపెల్లి శ్రీనివాస్‌గౌడ్, చోప్పదండి అంజన్న పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

ముస్తాబాద్, సెప్టెంబర్ 17 : ముస్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి మండల అధ్యక్షుడు ఓరగంటి తిరుపతి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఒరగంటి తిరుపతి, డాక్టర్ చింతోజు రాజారాం, ఓరగంటి సత్యం, లక్ష్మీరాజం, రమేశ్, బ్రహ్మ, శంకర్, చారి, విశ్వనాథం, శ్రీనివాస్, సద్గుణాచారి, చింతోజు రవి, బాలకిషన్ విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో విశ్వకర్మ భగవాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చందనగిరి గోపాల్, లక్ష్మీ నరసయ్య, దేవరకొండ చారి, యశోద, వేణు, వెంకట స్వామి, అంజయ్య, లక్ష్మీనారాయణ, మురళి, వెంకటాచారి పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, బండలింగంపల్లి, తదితర గ్రామాల్లోని విశ్వబ్రహ్మణ మనుమయ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు.

సమస్యలను పరిష్కరించాలి

వీర్నపల్లి, సెప్టెంబర్ 17 : గ్రామంలో ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండలం అడవిపదిరలో స్థానిక పంచాయతీ కార్యదర్శి మంగళవారం వినతిపత్రం సమర్పించారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 17: జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌లోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా ఆది శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడారు. దేశ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నేతృత్వంలో నిజాం ప్రభుత్వం ఆధీనంలో ఉన్న తెలంగాణ సెప్టెంబరు 17న భారతదేశంలో విలీనం అయిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో అమరులైన అమరవీరులను స్మరించుకుంటూ నివాళులర్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు నాగుల సత్యనారాయణ, సంగీతం శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్మల స్వరూప, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

● వేములవాడ : ప్రజాపాలనలో కార్యక్రమంలో భాగంగా మంగళవారం వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్‌రెడ్డి, కౌన్సిలర్లు, ఉద్యోగులు నాయకులు పాల్గొన్నారు. వేములవాడ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. స్థానిక సిపిఐ నాయకులు సెప్టెంబర్ 17వ తేదీని తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంగా పాటిస్తూ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీపీఐ పట్టణ కార్యదర్శి గాజుల పోశెట్టి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు జెండా ఆవిష్కరణ గావించారు.

● ఇల్లంతకుంట: ప్రజాపరిపాలన దినోత్సవం మండలంలో మంగళవారం ఘనంగా జరిగాయి. ఏఎంసీ కార్యాలయంలో చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, సెస్ కార్యాలయంలో డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో రామకృష్ణ, తహసీల్దార్ కార్యాలయంలో ఫారూఖ్, పోలీస్‌స్టేషన్‌లో శ్రీకాంత్‌గౌడ్, జూనియర్ కళాశాలలో దేవరాజం, కాంగ్రెస్ కార్యాలయంలో రాఘవరెడ్డి, బీజేపీ కార్యాలయంలో దేశెట్టి శ్రీనివాస్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

● ఎల్లారెడ్డిపేట: ప్రజాపాలన దినోత్సవం.. తెలంగాణ జాతీయ సమైక్యత వేడుకలు ఎల్లారెడ్డిపేట మండలంలో మంగళవారం ఘనంగా జరిగాయి. కార్యాలయాల్లో అధికారులు, కాంగ్రెస్ నాయకులు జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. హరిదాస్‌నగర్‌లో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషే కం చేశారు. తహసీల్దార్ రామచంద్రం, ఎంపీడీవో సత్తయ్య, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఐ రమాకాంత్, ఎక్సైజ్ సీఐ రమాకాంత్, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, రాజీవ్‌నగర్, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూర్, సర్ధాపూర్ గ్రామాల్లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని వార్డు కార్యాలయల్లో కౌన్సిలర్లు జాతీయ జెండాలను ఎగురవేశారు. నాయకులు జీల కిషన్‌యాదవ్, అగ్గిరాములు, జూపెల్లి శ్రీలత శ్రీనాథ్‌రావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.


సిరిసిల్ల కాంగ్రెస్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న నాయకులు


వేములవాడ మున్సిపల్ కార్యాలయం వద్ద

● గంభీరావుపేట : మండల కేంద్రంలో ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పాఠశాలల్లో జాతీయ జెండాలను ఎగరవేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్‌తో పాటు పట్టణ అధ్యక్షులు పాపగారి రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● ముస్తాబాద్: మండల కేంద్రంలో కాంగ్రెస్ , బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రజాపాలన, విమోచన, సమైక్యతా దినోత్సావాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజ్జెల రాజు, వివేనంద విగ్రహం వద్ద బీజేపీ అధ్యక్షుడు మెర్గు అంజాగౌడ్, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సురేందర్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

● సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజా పాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ జాతీయ జెండాలను ఎగురవేశారు. జడ్పీసీఈవో వినోద్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ప్రజాపాలన దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో మారుతిరెడ్డి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ ఎల్లాగౌడ్, మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారి నర్సింహులు జాతీయ జెండాను ఎగురవేశారు.

● తంగళ్లపల్లి: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఆర్డీవో రమేశ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. సిరిసిల్ల, నేరెళ్ల ప్యాక్స్ చైర్మన్లు బండి దేవదాస్, కొడూరి భాస్కర్‌గౌడ్, వైస్ చైర్మన్లు ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట: మండల పరిషత్ కార్యాలయంతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో, గ్రామపంచాయతీల్లో అధికారులు ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎస్సై రాజశేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి: మండల కేంద్రంలో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఒ నటరాజన్, సీఐ వెంకటేశ్వర్లులు జెండా ఎగురవేశారు.

రాష్ట్ర గ్రామీణ ప్రాంత విలేకరుల సంక్షేమ కమిటీ సభ్యుడిగా టీవీ నారాయణ


టీవీ నారాయణ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 17: తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ అనుబంధంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర గ్రామీణ ప్రాంత విలేకరుల సంక్షేమ కమిటీ సభ్యుడిగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ టీవీ నారాయణను నియమించారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లో టీయూడబ్ల్యూజె - ఐజెయు రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో రాష్ట్ర స్థాయి సమావేశంలో టీయూడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు కె విరాహత్ అలీ టీవీ నారాయణ పేరును ప్రతిపాదించగా కార్యవర్గం ఏకగ్రీవంగా అమోదించింది. టీవీ నారాయణ ఎంపిక పట్ల జిల్లాలోని ప్రెస్‌క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి క్షీరాభిషేకం

ముస్తాబాద్, సెప్టెంబరు 17 : సచివాలయం ఎదురుగా రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుకు నిరసనగా ముస్తాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సురేందర్‌రావు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, మాజీసెస్ డైరెక్టర్ విజయ రామారావు, సంతోష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● వీర్నపల్లి : బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి చిత్రపటానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జుల రాజిరెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు గుగులోతు కళ, బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సిరిసిల్ల సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి మాట్లాడుతూ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టడం నిరసిస్తూ తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మల్యాల దేవయ్య, ఫాక్స్ చైర్మన్లు బండ నరసయ్య, రామ్మోహన్‌రావు, నాయకులు మాందాల శ్రీనివాస్, కాశవేణి మహేష్, అనుపాటి భూంరెడ్డి, దొంతర వేణి శ్రీనివాస్, పోకల సంతోష్, రాజం, గొట్టె లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

●చందుర్తి: తెలంగాణ తల్లిని అవమానపరిచిన సీఎం రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య అన్నారు. మండల శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. సింగిల్ విండో చైర్మన్లు తిప్పని శ్రీనివాస్, జలగం కిషన్ రావు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగుల శ్రీనివాస్, నాయకులు మరాఠి మల్లిక్, ఈర్లపల్లి రాజు, పేగర్ల రమేష్‌రావు, బత్తుల కమలాకర్, లింగంపల్లి కరుణాకర్, గంద్ర లక్ష్మణరావు, గట్టు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరు గ్రామంలో తెలంగాణతల్లి విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా మాజీ జడ్పీవైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డిలు మాట్లాడుతు తెలంగాణ ప్రజల మనోభావాలను , ఆత్మగౌరవాన్ని కించపరిచే విధంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పట్నం శ్రీనివాస్,పుట్ట కుమార్, గుంటి అంజి, బండారి మహేష్‌గౌడ్, పట్నం మహేందర్, తోడేటి సతీష్ పాల్గొన్నారు.

● గంభీరావుపేట: బీఆర్ఎస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి జరిగిందని మండల పార్టీ అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామిగౌడ్, సెస్ డైరెక్టర్ నారాయణరావు అన్నారు. జాతీయ సమైక్యత దినోత్సవం జరిపారు. పట్టణ అధ్యక్షుడు వెంకటయాదవ్ ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపాలను ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల రూరల్, సెప్టెంబరు 17: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వం సాయుధ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల స్తూపాలను ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్ బాబు డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఏదుట సీపీఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మూషం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, మల్లారపు అరుణ్‌కుమార్, విమల పాల్గొన్నారు.

● కోనరావుపేట: కమ్యూనిస్టులే తెలంగాణ సాయుధ పోరాట వారసులని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రవెల్లి నాగరాజు అన్నారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరులైన చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎల్లారెడ్డి, మాసం సురేష్, కొంటెల్లి రాజయ్య, పవన్, రవి, అంజయ్య, ఆనందం, నరసయ్య తదితరులు ఉన్నారు.

సంక్షిప్తంగా..

● వేములవాడ టౌన్: వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి సింగిల్‌విండ్ ఆధ్వర్యంలో నిర్మించిన షెటర్‌లను మంగళవారం టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుతో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించి మాట్లాడారు. చైర్మన్ బీరెడ్డి సల్మాన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● వేములవాడ కల్చరల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురష్కరించుకుని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు రాజన్నకు కోడెమొక్కు చెల్లించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు సంతోష్‌బాబు ఉన్నారు.

- వేములవాడ దర్శనానికి వచ్చిన భక్తులు, ప్రయాణికులతో మంగళవారం వేములవాడ ఆర్టీసీ బస్టాండు కిక్కిరిసిపోయింది. బస్సుల కోసం గంటలపాటు బస్టాండులో నిరీక్షించారు.

● సిరిసిల్ల కలెక్టరేట్: సిరిసిల్ల జిల్లాలో నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో స్వచ్ఛతహీ సేవ ఫ్లెక్సీ ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. 17 సెప్టెంబర్ నుంచి అక్టోబర్ 2 వరకు ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, ఆర్ట్ పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, స్వచ్ఛభారత్ మిషన్ అధికారి సురేష్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

●వేములవాడ కల్చరల్: గణేష్ నవరాత్రులను పురష్కరించుకుని సోమవారం శోభయాత్రగా తీసుకువచ్చిన వినాయకుల నిమజ్జనం మంగళవారం మధ్యాహ్నం వరకు కొనసాగింది.

●తంగళ్లపల్లి:మండలంలోని మండేపల్లి శివారులోని కేసీఆర్ నగర్‌ను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని మండేపల్లి గ్రామస్థులు ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు.

● సిరిసిల్ల రూరల్ : ప్రధానమంత్రి అవాస్ యోజన అర్బన్ రెండవ దశను దేశ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మంగళవారం అవిష్కరించారు. కలెక్టరేట్‌లో వీడియోకాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తదిరతులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : చిన్న బోనాలలో వార్డు కౌన్సిలర్ బోల్గం నాగరాజుగౌడ్ ఏర్పాటు చేయించిన కెప్టెన్ విజయ రఘునందర్‌రావు విగ్రహాన్ని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి మంగళవారం ఆవిష్కరించారు.